గురించి ప్రశ్నించే అధికారం పాక్ ప్రభుత్వానికి లేదని చెప్పివేయడం—జరిగింది. తూర్పు పాకిస్తాన్‌లో ప్రజాప్రభుత్వాన్ని సమాధిచేసిన కరాచీ లీగువర్గాన్ని కాశ్మీర్ ప్రజలు విశ్వసించడం కలలో వార్త...నిజమే అందుచే పాక్ ప్రభుత్వం కాశ్మీరుకు దూరమయింది. ఆసియా రాజ్యాలలో అన్నిటికి చేదై...నన్నంటుకున ... కాకి... అనిపించుకున్నది. ఫకూపాకిస్థాన్‌కు విముఖత చూపి అఫ్గన్ రాజ్యాలకు పెడమొకమయింది ఇక పాక్ ప్రభుత్వం అమెరికాతో చేయికలిపి సాధించిందేమిటి? హైడ్రోజన్ బాంబు మెడలో కట్టుకున్నదా? ముస్లిం రాజ్యాలకు కన్నెర్రయై ఆసియా రాజ్యాల పరపతి పోగొట్టుకొని స్వదేశంలోనే గౌరవ భంగమునంది...నదీజల వినియోగములో కూడా వెనుకబడి...అందే లాభమేమిటి? ఇండో-చైనా యుద్ధ విరమణతో కీల్లు లాగిన అమెరికా యుద్ధనౌకలకు ఆశ్రయమవడమే లాభం కాబోలు. టర్కీలో ఉపయోగింపబడిన పాత ఆయుధాలతో మొదటి అమెరికా నౌక రాబోయే అక్టోబరులో కరాచీ రేవుకు చేరుతుందట...అదీ లాభం...అన్ని విధాలా రాజకీయంగా దివాళా తీసిన రాజ్యాల జాబితా ఒకటి పుస్తకముగా తయారవుతోందట ... దానికి మాలటోవ్ పీఠిక వ్రాస్తాడని...ఈడెన్ ప్రశంసయిస్తాడని చెప్పుకుంటున్నారు. ఆ జాబితాలో మొదట అమెరికా పేరు రెండు పాకిస్తాన్ పేరు ఉన్నట్లు గట్టిగా విజ్ఞులద్వారా తెలుస్తోంది... అమెరికా రిపబ్లిక్ పార్టీ హారతి కర్పూరం అయ్యే తరుణ మాసన్నమయిందంటున్నారు వారే...మొత్తము ముప్పది రాజ్యాల కాయుధాలు సప్లయిచేసే అమెరికా ఆనాటికానాటికి అవయవాలను లోనికి లాగుకొన్న కూర్మం అవుతోందట...ఇదంతా...ఏమిటి మరి...అంటూ ఓబయ్య భసితక్షిప్తాజ్యమంటూ తిరిగి కూనిరాగములో పడ్డాడు.

"చుట్టమే యముడు" అని పదేపదే ఆలపించాడు సంగయ్య...ఆయన వాదన యేమిటో తెలిసికోండన్నాను నేను...ఆమీద అందరు ప్రశ్నించారు..."చుట్టాలుగా వచ్చి చూరులంటించే విదేశరాయబారుల సంగతి కాదు నేను చెప్పేది." మూలిగాడు సంగయ్య...మరేమిటి? అన్నారు.

గడచిన రాత్రి...సరిగ్గా పదకొండు గంటలకు...దిగా డోకచుట్టం...పైగా మెయిల్ లేటయిందంటాడు...తిరిగి వంట...అవీ...అన్నీ యథాశాస్త్రంగా చేయవలసివచ్చింది...ఉదయం తెలిసింది...ఆయన మా శ్రీమతిని తీసుకొని వెళ్ళడానికి వచ్చిన బావ అని...అప్పటినుండి...అంటే...ఆమె వెళ్ళక తప్పలేదనుకోండి... "చుట్టమే యముడు..." అని నిర్ధారణ అయింది. అందరూ వికవికా నవ్వారు.

గల్పిక

# రాద్ధాంతం!

నిడదవోలు మాలతి

"అమ్మగారు నెయ్యమ్మన్నారండీ" అంటూ ఓ చిన్నగిన్నె చేత్తోపుచ్చుకొని వచ్చాడు ఒక కుర్రాడు.

"ఎవరూ?" అన్నాన్నేను ఎవరో అర్థంగాక.

"చుక్కమ్మగారు."

"ఎవరూ?"

"ఆ యింట్లో ఉన్నవారూ..." అంటూ, మాయింటి పక్కింటికి ఎదురింటికి ఎడంపక్కిల్లు చూపించాడు సాధారణంగా.

"మిస్ రైనాసిరస్" అనడమేకాని పేరు ఇన్నాళ్ళు తెలీదుకాని ఆ యింట్లో ఉన్నారని తెలుసు.

"వెనకనుంచి ఏకంగా స్వయంపాకం పంపిస్తాంలే, వెళ్ళు" అన్నాను విసుగ్గా. వాడు వెళ్ళిపోయాడు.

అమ్మవచ్చింది, "ఎవరే?" అంటూ.

"ఏముంది. మేడమ్ ఫులిస్టాప్‌గారికి సెయ్యి బదులు కాలిట."

"మేడమ్ ఫులిస్టాపెవరూ?"

"ఆవిడలేదమ్మా..." అంటూ ఆ ఉన్నావిడ గుర్తులు ఎన్ని చెప్పినా అమ్మకి అర్థంగాలేదు. ఆఖరికి రోజూ చేబదులుకొచ్చే ఆవిడ అన్నాను.

కూర మాడిపోతుందంటూ అమ్మ వెళ్ళిపోబట్టి సరిపోయింది.

అసలు నాకు ఇలాటివంటే వళ్లుమంట. అవసరాలైతే రాకుండా ఉండవు కాని రోజుకి పది మాట్లు ఏదో ఒకటి కావాలని వస్తుంటే ఎవరు భరించగలరూ?

* * *

"నీదగ్గిర విడిరూపాయలు నాలుగున్నాయా?" అంది అమ్మ పదిరూపాయల నోటు చేత్తో పుచ్చుకొని.

"విడి నాలుగూ లేవు నాలుగురూపాయల నోటూ లేదు. ఎందుకు?" అన్నాను.

"పప్పులు వీధిలోకొస్తే కొన్నాలే. చుక్కమ్మగారు నెల్లాళ్ళక్రిందట ఐదురూపాయలు పట్టుకెళ్ళారు, అడిగితే?"

గుమ్మంలో కెళ్ళేసరికి ఎదురుగుండా ఈజీ ఛైర్‌లో చుక్కమ్మ కనిపించింది.

ఏవమ్మా? అంది. "ఎందుకొచ్చావ్" అన్నట్టుంది ఆ మాట.

"మాఅమ్మ ఏవో పప్పులుకొందిట" అన్నాను. మాట కలపడానికి.

"ఏం పప్పులు?"

బండి పట్టాలు తప్పేట్టుంది. "ఏమోనండీ" అన్నా వదిలి పెట్టకుండా "ఎలా కొన్నారో?" అంది.

"ఏమోనండీ. మీరేమో ఎప్పుడో అయిదు రూపాయలు పట్టుకెళ్ళారట. అడిగి తెమ్మంది" అన్నాను అక్కడికి కట్ చేసే ఉద్దేశ్యంతో.

"ఏమిటీ మేం...మీకు...అయిదురూపాయలివ్వాలా?" అంది ఆవిడ దీర్ఘాలుతీస్తూ.

నేను కొంచెం భయపడ్డాను. ఒకవేళ అమ్మ కాని మర్చిపోయిందేమోనని. నేను మాట్లాడలేదు.

"తెస్తే వెంటనే ఇచ్చేసేవాళ్ళం. అసలు మాకేం అవసరం? ఒకవేళ ఆ దొంగవెధవ తెచ్చాడు కాబోలు" అంటూ.

నేనే సమాధానం చెప్పకముందే "రాముడూ!" అని ఆవిడ కేక వేయడం సదరు రాముడు హాజరు కావడంకూడా జరిగింది.

"వీళ్ళింట్లో ఐదురూపాయలు తెచ్చావా?" అంది ఆవిడ కఠినస్వరంతో. వాడు నావేపు ఓ మాటు, ఆవిడవేపు ఓమాటు వంతుల ప్రకారం చూడడం మొదలు పెట్టాడు.

"అలా చూస్తావేం? నిజంచెప్పు" అంటూ ఆవిడ ఒక్క లెంపకాయ కొట్టింది. దాంతో వాడు "నాకేం తెలీదు బాబోయ్." అంటూ పంచమస్థాయిలో ఆరునొక్క రాగం కర్ణకఠోరంగా ఆలపించడం ప్రారంభించాడు.

నేనలా నిల్చుండిపోయాను తెల్లబోతూ.

ఇంతలో చుక్కమ్మగారి తమ్ముడొచ్చాడు. అతనికి సాభినయంగా సకలం వర్ణించే సరికి అతను కళ్ళెర్రజేసి "ఏరా" అన్నాడు. వాడు ఏడుస్తూనే "నాకేం తెలియదండీ" అన్నాడు. నిజం చెప్పమంటూ చావగొట్టారు. వాడు ఎంత తెలీదని మొత్తుకున్నా వినక. మధ్యమధ్యలో చుక్కమ్మ "దెబ్బలు తినకు, అబద్ధం ఆడకు. అసలు నాకు అప్పుతీసుకోడమంటే పొడుచుకుని చచ్చినట్టుంటుంది." అంటూ ఎవరితో మాట్లాడుతోందో తెలీకుండా వాగుతోంది.

నేనలా చూస్తూ నిల్చున్నాను.

ఆఖరికి వాడిచేత తీసుకున్నట్లు అనిపించారు. నేను మాట్లాడకుండా ఇంటికొచ్చి అమ్మతో అంతా చెప్పాను. అంతావిని అమ్మ "అదేవిటి. చుక్కమ్మగారే నాదగ్గిర తీసుకెళ్ళిందావేళ" అంది. నేను నిర్ఘాంతపోయాను.

"ఐతే మరి వాడెందుకు తెచ్చి స్వంతానికి వాడుకున్నాను అని ఒప్పుకున్నాడు?" అన్నా అప్రయత్నంగా.